ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
గురువారం 4 జూలై 2024



కూలిన 'నిర్లక్ష్యం' - కుప్పకూలుతున్న మానేరు వంతెన గర్డర్లు 5లో..

బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో కేటాయించాలి 6లో..



జాడలేని ఫీజు రీయింబర్స్‌మెంట్

- రెండేళ్లుగా విడుదల కాని బడ్జెట్
- ఏడాదిగా విద్యార్థులకు అందని స్కాలర్‌షిప్
- జిల్లా వ్యాప్తంగా పెండింగులో రూ.29.29 కోట్లు
- కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల నుంచి ఫీజు వసూలు
- ఇబ్బందులు పడుతున్న బీసీ, ఈబీసీ విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రైవేట్ కళాశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు, కళాశాలల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా రెండు విద్యా సంవత్సరాలకు సంబంధించి 29 కోట్ల 29 లక్షల 17 లక్షల రూపాయలు ప్రభుత్వం నుంచి విడుదల కావాల్సి ఉన్నాయి. కావాల్సిన బడ్జెట్ కోసం జిల్లా వెనుకబడిన తరగతుల శాఖాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినప్పటికీ, బడ్జెట్ విడుదల కావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని మెలిక పెడుతున్నారు. అలాగే విద్యార్థులకు నెలనెలా చెల్లించే స్కాలర్‌షిప్ సొమ్మును కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. జిల్లాలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్, బీఈడీ, డీఈడీ, నర్సింగ్, బీఫార్మసీ, ఎంఫార్మసీ తదితర కోర్సులకు సంబంధించిన కళాశాలలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు సైతం ఉన్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు నిర్ధేశించిన మేరకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజు కంటే ఎక్కువ ఉన్న మొత్తాన్ని విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే మెస్ చార్జీల కింద కోర్సులను బట్టి స్కాలర్‌షిప్ ఇస్తారు. ఈ సొమ్మును నెలనెలా గాకుండా ఒకేసారి విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కేవలం స్కాలర్‌షిప్ డబ్బులను మాత్రమే వారి ఖాతాల్లో జమచేస్తారు.

● విద్యార్థులు ఆందోళన..

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై 5 వేల నుంచి 6 వేల మంది విద్యార్థులు ఆధారపడి ఉన్నత చదువులు చదువుతున్నారు. రెండేళ్ల నుంచి ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ విద్యార్థులకు 25 లక్షల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎంబీసీ విద్యార్థులకు 4 లక్షల 61 వేల రూపాయలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నాయి. 2022-23 సంవత్సరానికి బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు చెల్లించినప్పటికీ 10 కోట్ల 11 లక్షల 20 వేల రూపాయలు, ఈబీసీ విద్యార్థులకు సంబంధించి 66 లక్షల 46 వేల రూపాయలు విడుదల కావాల్సి ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 3 కోట్ల 95 లక్షల 50 వేల రూపాయల స్కాలర్‌షిప్ డబ్బులు ఇప్పటి వరకు కూడా విద్యార్థుల ఖాతాల్లో జమ కాలేదు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ 13 కోట్ల ఒక లక్షా 40 వేల రూపాయలు, ఈబీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక కోటి 20 లక్షల రూపాయలు విడుదల కావాల్సి ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు రాక ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి సకాలంలో వేతనాలు చెల్లించేందుకు తంటాలు పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యజమానులు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని సమాచారం. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి మాత్రం కాగితాలు రాయించుకుని ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెబుతున్నారని విద్యార్థులు చెబుతున్నారు. రెండు విద్యా సంవత్సరాలు ముగిసినా కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్ డబ్బులు విడుదల చేయకపో వడంతో ఆందోళన చెందుతున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలుచే సేందుకు ఆయా పతకాలకు బడ్జెట్‌ను మళ్లిస్తుండడంతో ఫీజులు విడుదల కావడం లేదని తెలుస్తున్నది. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడంపై దృష్టి సారించింది. పన్నుల రూపేణా ప్రభుత్వానికి జమ అవుతున్న డబ్బులను రుణ మాఫీకే మళ్లిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యజమానులు కోరారు.

అప్పన్నపేట సింగిల్‌విండోకు రాష్ట్ర స్థాయి అవార్డు

- నేడు హైదరబాద్‌లో అవార్డు ప్రదానం



అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

పెద్దపల్లి రూరల్, జూలై 3 : మండలంలోని అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అందించిన సేవలకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. జాతీయ కోఆపరేటివ్ అభివృద్ధి కార్పొరేషన్ సంస్థ ద్వారా 2023లో రైతులకు ఉత్తమ సేవలు అందించినందుకు బెస్ట్ ప్రైమరీ కోఆపరేటివ్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కోఆపరేటివ్ కార్యాలయంలో అవార్డును అందించనున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలిపారు. రాష్ట్రస్థాయి గుర్తింపు రావడంపై సింగిల్‌విండో చైర్మన్ చింతపండు సంపత్, డైరెక్టర్లు హర్షంవ్యక్తంచేశారు.

ఓడెడు వంతెన వద్ద కూలిన గర్డర్ల పరిశీలన



కూలిన గర్డర్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం, జూలై 3 : మండలంలోని ఓడేడు గ్రామ శివారులోని మానేరు వంతెనపై మంగళవారం రాత్రి కూలిన గర్డర్లను అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ చందర్‌సింగ్ కూలిన వాటిని పరిశీలించి నివేదికను తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. గతంలో గర్డర్ల కింద ఉన్న చెక్క ముక్కలు పుచ్చు పట్టడంతో ఒకవైపునకు వంగి కూలిపోయాయని తెలిపారు. ఈదురుగాలులకు ఒక గర్డరు మరొక గర్డరుకు తగిలి మొత్తం 5 గర్డర్లు కూలినట్లు నిర్ధారణ చేశారు. ఉన్నతాధికారుల నివేదిక అనంతరం తదుపరి చర్యలు చేపడుతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఈఈ రాములు, జేఈ జాఫర్ పాల్గొన్నారు. అలాగే కూలిన గర్డర్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, సింగిల్‌విండో చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, కోల విజయ్, దాసరి చంద్రమౌళి తదితరులు పరిశీలించారు.

జర్మనీ బృందంతో భేటీలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



జర్మనీ బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జూలై 3: హైదరాబాద్ సచివాలయంలో బుధవారం నోకియా జర్మనీ బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ పాల్గొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో క్వార్ట్ జెన్ కంపెనీ ప్రతి పాఠశాలలో ఐడబ్ల్యూబీ ఏర్పాటు చేయడానికి ముందుకువచ్చిందని, విద్యార్థులకు ల్యాబ్‌ట్యాబ్ అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో 5జీ నెట్‌వర్క్‌ను మరింత అభివృద్ధి చేసి అన్ని రంగాలకు అందించాలని క్వార్ట్‌జెన్ కంపెనీని మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ కోరారు. గ్లోబల్ హెడ్ మార్టిన్ డైరెక్టర్ వెంకట్, పద్మజ, రాజేష్, సీఎస్‌రావు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులు గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 3: కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్ 2 గ్రాండ్ టెస్ట్‌లో పాల్గొనేందుకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సంచాలకులు డాక్టర్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను టీజీబీసీ స్టడీసర్కిల్.సీజీజీ. గోవ్. ఇన్ వెబ్‌సైట్‌లో సమర్పించాలని, వివరాలకు 0878-2268686 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

అధికారులు విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

పెద్దపల్లి, జూలై 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అధికారులు తమ విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, డీసీపీ ఎం చేతన, జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ బాబు, రీసెర్చ్ అధికారి డి వరప్రసాద్‌లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలుచేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలు, విద్య, వైద్యం సంక్షేమ రంగంలో ఎస్సీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అదనపు కలెక్టర్ వివరించారు. గత మార్చి నెలలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు నిర్వహించిన సమావేశంలో జారీ చేసిన సూచనలు, పనుల పురోగతి వివరాలను, తమ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా సంక్షేమ అధికారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ సంక్షేమ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, పరిశ్రమల శాఖ, లీడ్ బ్యాంకు మేనేజర్ వివరించారు. అనంతరం వడ్డెపల్లి రాంచందర్ మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ కింద వివిధ సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ నిధులపై రాష్ట్రస్థాయి ప్రిన్సిపాల్ సెక్రెటరీకి లేఖ రాయాలన్నారు. పెండింగ్ స్వయం ఉపాధి యూనిట్లు త్వరితగతిన గ్రౌండ్ అయ్యేలా చూడాలని, 4 సంవత్సరాలుగా కులాంతర వివాహాల ప్రోత్సాహకాల పెండింగ్‌పై నివేదిక అందించాలన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలపై నివేదిక అందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సకాలంలో పరిష్కరించాలని, అందించిన పిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్తులను అరెస్టు చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులను జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు బి గంగయ్య, హనుమా నాయక్, పెద్దపల్లి, గోదావరిఖని ఏసీపీలు, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మంథని మున్సిపల్ సమగ్రాభివృద్ధి కోసమే స్టడీ టూర్

- చైర్‌పర్సన్‌పెండ్రు రమ-సురేశ్‌రెడ్డి



ఖమ్మం కార్పొరేషన్‌ను సందర్శించిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు

మంథని, జూలై 3 : మంథని మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడానికి శ్రీధర్‌బాబు ఆదేశాలు, కలెక్టర్, అదనపు కలెక్టర్ సూచనలతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో స్టడీ టూర్‌లో భాగంగా పర్యటించినట్లు చైర్ పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్, ఉద్యోగులతో కలిసి చైర్‌పర్సన్ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో బుధవారం పర్యటించారు. అక్కడి ఇంటిగ్రేటెడ్ కూరగాయల మార్కెట్‌ను, రోడ్లు, డ్రైనేజీలు, మినీ ట్యాంక్ బండ్ల నిర్మాణంతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ గురించి అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖమ్మంలో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు, వాటి నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను పూర్తిస్థాయిలో తెలుసుకునేందుకు ఈ టూర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు చొప్పకట్ల హనుమంతు, గుండా విజయలక్ష్మి, నక్క నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

కోల్‌సిటీ, జూలై 3: గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలోని పలు బ్యాంకుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బ్యాంకుల వద్ద భద్రత ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో పని చేసే అలారం సిస్టంను పరిశీలించారు. బ్యాంకులో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానీ, 100 నెంబర్‌కు కానీ సమాచారం ఇవ్వాలని బ్యాంకు అధికారులకు సూచించారు.

రేపు మల్లికార్జున స్వామి ఆలయంలో వేలంపాట

ఓదెల, జూలై 3 : మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో ఈనెల 5న జాతరలో పలు వాటిని అమ్ముకొను హక్కు కోసం వేలంపాటను నిర్వహిస్తున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించే ఈ వేలంలో హోటల్, స్వీట్‌హౌస్, మానియార్ సామగ్రి, అమ్ముకునే హక్కు కోసం రూ.25వేల చొప్పున ధరావతు చెల్లించాలని కోరారు. అలాగే స్వామివారి ఫొటోలు, వంటపాత్రలకు రూ.10వేలు, అలాగే వాహనపార్కింగ్ హక్కు కోసం రూ.లక్ష ధరావత్తు చెల్లించాలని కోరారు. వేలంపాటలో దక్కించుకున్న వ్యక్తులకు జులై 6 నుంచి 2025 మార్చి రెండు వరకు దీని కాల పరిమితి ఉంటుందని తెలిపారు.

పచ్చని తెలంగాణగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం

- మొక్కను నాటడం, పర్యవేక్షించడం అందరి బాధ్యత - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లి రూరల్, జూలై 3 : తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చదనం హరివిల్లే విధంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పచ్చని చెట్లతో తెలంగాణ రాష్ట్రం విలసిల్లే విధంగా మార్చడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమాన్ని పెద్దపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోసారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించడం శుభసూచికమని, విద్యార్థులు చదువుకునే దగ్గరే పచ్చని వాతావరణం కనిపిస్తే ఇతరులకు అవగాహన కల్పిస్తారన్నారు. నాటిన ప్రతి మొక్కకు సుమారు రూ.100 ఖర్చు చేస్తుందని వాటిని రక్షించాలని, ప్రారంభించామా వెళ్లామా అని ఉండకూదన్నారు. జిల్లాలో గత పదేళ్లలో మొక్కలు నాటేందుకు 600కోట్లు ఖర్చు చేశారని వాటిని రక్షిస్తే మళ్లీ మొక్కలు పెట్టాల్సిన దుస్థితి ఉండేది కాదని, వాటిని సంరక్షణ లేకపోవడంతో వృథాఅయ్యాయన్నారు. గత ప్రభుత్వం మొక్కలు పెంచాలని ఆలోచన ఉన్నా ఆచరణలో లేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో విధులు నిర్వహిస్తున్న అన్ని శాఖల అధికారులు జవాబుదారీతనంగా ఉండాలని, మొక్కల నాటడంలో ఏదైనా కొరత ఉంటే సమాచారం అందించాలన్నారు. జిల్లా అభివృద్ధి చెందే విధంగా ప్రతి శాఖ అధికారులు సహకారం అందించాలన్నారు. జిల్లాను గ్రీన్ జిల్లాగా మార్చాలని, ఆ బాధ్యత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులపైనే ఉందన్నారు. జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 27 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా నాటడంతో పాటు వాటిపై ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్‌టీపీసీ, సోలార్, సింగరేణి, కేశోరాంతో పాటు పరిశ్రమల ద్వారా కూడ మొక్కలు నాటే కార్యక్రమంలో వారిని భాగస్వాములు చేయాలన్నారు. కాలుష్య నివారణకు అందరి తోడ్పాటు అవసరమన్నారు. ఎక్కడైనా ఏపుగా పెరిగినా చెట్లు ఉంటే వాటిని కోట్టి వేయకుండా నూతన టెక్నాలజీతో ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమాన్ని పెద్దపల్లిలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం 6 కోట్ల మొక్కలు నాటినా 6 లక్షల మొక్కలు కనిపించని పరిస్థితి ఉందన్నారు. నాటిన ప్రతి మొక్కను రక్షించాలని, ఒకవేళ అవి చనిపోతే లోపాన్ని గుర్తించి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, అదనపుకలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జిల్లా అటవీశాఖఅధికారి శివయ్య, జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రంగారావు, పెద్దపల్లి సీఐ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, మున్సిపల్ ఏఈ సతీష్‌కుమార్, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, ప్రకాష్, గోపగాని సారయ్యగౌడ్, నూగిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్,రాజేందర్, మందల సత్యనారాయణరెడ్డి, పురుషోత్తం, కారెంగల రమేష్, శిలారపు సత్యం, పెగడ రమేష్, సంతోష్, కడార్ల శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఇంటికి ఆరు మొక్కలు ఇచ్చారు.. కనీసం వెళ్లి చూశారా..?

- కమిషనర్‌ను ప్రశ్నించిన మంత్రి

పెద్దపల్లి రూరల్, జూలై 3 : పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో ఇంటింటా ఆరు మొక్కలను పంపిణీ చేశారు సరే వాటిని అధికారులు ఎవరైనా వెళ్లి చూశారా... అంటూ వన మహోత్సవ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మున్సిపల్ కమిషనర్ వెంకటేష్‌ను ప్రశ్నించారు. ప్రతి ఇంటికి 6 మొక్కలు పంపిణీ చేశారు. మొక్కకు 100 రుపాయల ఖర్చు వస్తుంది.. అంటే ప్రతి ఇంటికి రూ.600 విలువగల మొక్కలు పంపిణీ చేశాం. కనీసం ఇంటింటికి వెళ్లి పరిశీలించారా.. అవి బతికాయా లేదా.. అనే అంశాలపై కమిషనర్, ఆర్పీని అడిగారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం చేయకుండా మొక్కలను రక్షించే ప్రయత్నం చేయాలని సూచించారు.



పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

బొగ్గు బ్లాకుల వేలంపాటలపై విప్లవ కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న హరగోపాల్, కోదండరాం

గోదావరిఖని, జూలై 3: సింగరేణి ప్రాంతంలోని బొగ్గు బ్లాకుల వేలంపాటల అంశం రాష్ట్ర రాజధానికి చేరింది. హెచ్ఎంఎస్, విప్లవ కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ, టీఎస్‌టీయూసీ తదితర కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, విమలక్క, రాములునాయక్, బోసు అనురాధ, టీ శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఐదు డిమాండ్లను సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుంది. ఈ ఐదు డిమాండ్లలో కేంద్రం తలపెట్టిన బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ నుంచి తెలంగాణ బొగ్గు బ్లాకులను తొలగించాలి, తెలంగాణ భూగర్భంలో ఉన్న ప్రతి బొగ్గుబ్లాకును సింగరేణికే కేటాయించాలి, ఓపెన్‌కాస్టు పేరిట జరుగుతున్న సాగుభూముల విధ్వంసాన్ని వెంటనే నిలిపివేయాలని ఈ సమావేశం డిమాండ్ చేసింది. అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసిలకే ప్రాజెక్టులను కేటాయించాలని తీర్మాణించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఐదు కొత్త భూగర్భ గనులను ప్రారంభించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేసింది. ఈ ఐదు డిమాండ్లపై ఐక్య వేదిక భవిష్య పోరాటాల కార్యాచరణను రూపొందించనున్నది. ఈనెల 7వ తేది నుంచి 25వ తేది వరకు సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయాల ముందు ధర్నాలు, 29న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట నిరాహార దీక్షలు, ఆగస్టు మొదటి వారంలో ఇందిరా పార్కు వద్ద దీక్ష చేపట్టాలని తీర్మానించారు.

అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిని, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ని కలిసి మెమోరాండాలు ఇవ్వాలని, ఆ తరువాత కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహిచాలని తీర్మానించారు. అప్పటికీ కేంద్ర దిగిరాని పక్షంలో సకల జనుల సమ్మెకు కూడా పిలుపునివ్వాలని నిర్ణయించారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటి మట్టం

● ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కులు రాక

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 3,762 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 11.125 టీఎంసీల నీరు నిల్వఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 16.126 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 4.980 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

రాజన్న ఆలయంలో బ్రేక్ దర్శనం అమలుకు ఏర్పాట్లు

వేములవాడ కల్చరల్, జూలై 3 : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులకు బ్రేక్ దర్శనం వెసులుబాటును కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్న నేపథ్యంలో బ్రేక్ దర్శనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు చేస్తున్న ప్రయత్నం ఎట్టకేలకు ఫలించనుంది. బ్రేక్ దర్శనం ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర దేవదాయశాఖ కార్యాలయానికి పంపించినట్లు రాజన్న ఆలయాధికారులు తెలిపారు. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే బ్రేక్ దర్శనం ఏర్పాటు చేసున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు బ్రేక్ దర్శనం చేసుకునేందుకు వీలుగా ఒక్కొక్కరికి రూ. 300 టికెట్ ఏర్పాటు చేయనున్నారు. ప్రతి నిత్యం ఉదయం 10.15 గంటల నుంచి 11.15 వరకు గంటపాటు బ్రేక్ దర్శనం, సాయంత్రం 4 గంటల సమయం నుంచి 5 గంటల వరకు గంటపాటు బ్రేక్ దర్శనం వెసులుబాటు అందుబాటులోకి తీసువస్తున్నట్లు తెలిసింది. రాజన్న ఆలయంలోని ఉత్తర ద్వారం ద్వారా బయటకు వెళ్లు దారి నుంచి గంటపాటు బ్రేక్ దర్శనం లైన్‌ను, లేక ప్రత్యేకమైన పై ఓవర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

కరీంనగర్ బస్టాండ్‌లో చోరీకి యత్నం

● పట్టుకున్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది

కరీంనగర్ క్రైం, జూలై 3: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక పాత నేరస్థుడు ఒక వ్యక్తి జేబులో నుంచి పర్సు దొంగలించే యత్నం చేస్తుండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు. ఐదు సంవత్సరాల కిందట బస్టాండ్‌లో దొంగతనానికి పాల్పడిన కరీంనగర్ ఆదర్శనగర్‌కు చెందిన చిలుక రాజు మళ్లీ బుధవారం బస్టాండ్‌లో ఒక ప్రయాణికుడి జేబులో చేతులు పెట్టి దొంగతనానికి పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు నిందితుడిని మూడో టౌన్ పోలీసులకు అప్పగించామని తెలిపారు. ఏటీఎం కృష్ణ, ఐసిఎస్ రావు, ఏఎస్ఐ లక్పతి, కానిస్టేబుల్ బివి రమణ, విజిలెన్స్ సెక్యూరిటీ ప్రదీప్, మానస, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక మృతి

చందుర్తి, జులై 3: కుటుంబ కలహాలతో ఓ బాలిక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతున్న బాలిక బుధవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం బండపల్లికి చెందిన కుమ్మరి శ్రీవాణి(15)అనే బాలిక ఈ నెల 1న కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీవాణి మృతి చెందింది. ఈ సంఘటనపై తల్లి లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


సత్తక్కపల్లిలో ఊరేగింపుగా బోనాలతో భక్తులు

మెట్‌పల్లి రూరల్, జూలై3: మండలంలోని సత్తక్కపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం భక్తులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఇంటికోక బోనాన్ని భక్తిశ్రద్ధలతో తయారు చేశారు. తయారు చేసిన బోనం భక్తులు నెత్తిన ఎత్తుకొని డప్పుచప్పుళ్ల మధ్య పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, అధిక దిగుబడులతో రైతులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నారు. బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు, సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

మానకొండూర్ : మండలంలోని కొండపల్కల గ్రామంలో జరుగుతున్న రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఎల్లమ్మ పట్నాలు, జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో గౌడ కులస్తులతో పాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరలో సంఘం నాయకులు మల్యాల మొగిలి, నల్లగొండ రాములు, దూలం సంపత్, బోంగోని కనుకయ్య, మాజీ సర్పంచు కొరిమి పితాంబర్, మల్యాల రాములు, కొరిమి విష్ణు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేంపేటలో హరితహారం చెట్లు నరికివేత

మెట్‌పల్లి రూరల్, జూలై, 3 : మండలంలోని వేంపేట గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం నీరుగారిపోతోంది. హరితహారం పథకం కోసం ప్రతియేటా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. వేంపేట గ్రామ శివారులో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు పూర్తిగా విద్యుత్ లైన్ కిందనే అధికంగా ఉన్నాయి. ఈ మొక్కలు ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు అంటుకొనే ప్రమాదం ఉందని సుమారు 100కు పైగా చెట్లను నరికివేశారు. ఈ విషయంపై కార్యదర్శిని అడగగా రోడ్డు పక్కన ఉన్న రైతులు నరికి వేసి ఉంటారని పలువురు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం హరితహారంలో చెట్లను నాటండి అని చెబుతుంటే కొందరు అందుకు విరుద్ధంగా నడుచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ విషయంపై ఇంచార్జి ఎంపీడీవో రామకృష్ణను ఫోన్ ద్వారా వివరణ కోరగా విషయం తెలయదు, తమ దృష్టికి బుధవారం వచ్చిందని, చెట్లను నరికింది ఎవరనే విషయంలో విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ సంపదను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


వేంపేట శివారులో నరికి వేసిన చెట్లు

10 నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జూలై3: ఎస్‌యూ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎమ్ఎస్ డబ్ల్యూ, ఎమ్మెస్సీ విద్యార్థులకు నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గణేశ్‌నగర్, జూలై3: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఆసక్తి గల ఉమ్మడి జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle. cgg. gov.in వెబ్‌సైట్‌లో శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 8,9,15,16,22,23,30,31తేదీల్లో ఉదయం 10గంటల నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు అయన పేర్కొన్నారు. వివరాలకు 0878-68686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

గణేశ్‌నగర్, జూలై 3: పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి రెండు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎం.జ్ఞానప్రకాష్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కోర్సులో ప్రవేశానికి టీఎస్-పాలీసెట్ 2024 పరీక్షలో ఉత్తీర్ణులైన ఎంబైపీసీ ర్యాంక్ విద్యార్థులు అర్హులు. ఈ యూనివర్సిటీ పరిధిలో నాలుగు పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాలలు, మహబూబ్‌నగర్, మామునూర్ (హనుమకొండ జిల్లా), సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో మొత్తం 110 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కోర్సులో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్, ప్రైవేటు రంగంలో డెయిరీ, పౌల్ట్రీఫార్మ్, పెట్ హాస్పిటల్‌లో ఉపాధి అవకాశాలు మెండుగా వున్నట్లు తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఆసక్తి గల విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www.tsvu.edu.inలో అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 20లోపు దరఖాస్తు చేయవచ్చని తెలియజేశారు.

కుక్కల దాడిలో వృద్ధ దంపతులకు గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై3: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన రామ్ కనుకమ్మ, రామ్ బోషయ్య వృద్ధ దంపతులు కొంత కాలంగా అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నారు. బుధవారం ఇంట్లో పడుకొని ఉన్న వృద్ధ దంపతులపై వీధి కుక్కలు దాడి చేశాయి. కనుకమ్మకు కుక్కల దాడిలో కాలుకు గాయాలయ్యాయి. గ్రామస్థులు 108కి సమాచారం అందించడంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'మాటిచ్చా.. సరస్వతి గుడిని నిర్మించా'

- 'ఆంధ్రజ్యోతి'తో సినీ గేయ రచయిత చంద్రబోస్
- ఆయన స్వగ్రామం చల్లగరిగలో 'ఆస్కార్ గ్రంథాలయం'



ఆస్కార్ గ్రంథాలయం

చిట్యాల, జూలై 3: ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ తన గ్రామ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో సొంత నిధులతో ఆస్కార్ పేరిట ఓ గ్రంథాలయాన్ని నిర్మించారు. ఈ ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం జరగనుంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో బుధవారం ఫోన్‌లో మాట్లాడిన చంద్రబోస్.. 'గ్రామస్థులకు ఇచ్చిన మాట ప్రకారం సరస్వతి గుడిని నిర్మించా. చాలా సంతోషంగా ఉంది' అని ఆనందం వ్యక్తం చేశారు. చల్లగరిగలోని తమ ఇంటి పక్కన ఉన్న గ్రంథాలయంలో ఎన్నో సాహిత్య పుస్తకాలు చదివానని, వాటి వల్లే తాను ఉన్నత స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా చెప్పారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు తాను రాసిన నాటునాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడంతో బాల్య మిత్రులు, గ్రామ ప్రజలు తనని సన్మానించారని చెప్పారు. ఆ సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ గ్రామంలో అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మిస్తానని ఇచ్చిన మాటను ఈ రోజున నిలబెట్టుకున్నానని వివరించారు. అందరి సహకారంతో రూ. 36లక్షల వ్యయంతో ఎనిమిది నెలల్లో భవనాన్ని సిద్ధం చేసి ఆస్కార్ గ్రంథాలయం అని నామకరణం చేశామని చెప్పారు. కాగా, రచయిత చంద్రబోస్ తన సొంత నిధులతో నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రంథాలయాల జిల్లా కార్యదర్శి శ్రీలత తెలిపారు.

ఇద్దరు రైతుల ఉసురు తీసిన అప్పులు

పెంబి రూరల్, బొంరాస్‌పేట్, జూలై 3: పంటల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నిర్మల్ జిల్లా పెంబి మండలం యాపల్‌గూడ గ్రామానికి చెందిన రైతు అర్క సంతోష్ (28) తనకున్న ఎకరంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాడు. ఇందుకోసం రూ.లక్షల్లో అప్పు చేశాడు. పత్తి విత్తనా లు మొలకెత్తకపోవడంతో పాటు చేసిన అప్పులు తీర్చాలని బాకీలు ఇచ్చిన వారు వేధించడంతో మనస్తాపానికి గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వికారాబాద్ జిల్లా మెట్లకుంట గ్రామానికి చెందిన బైరం నర్సింహులు(62)కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వారి వివాహాల కోసం చేసిన అప్పులు తీర్చేందుకు తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో ఎకరన్న సీలింగ్ భూమిని అమ్మకానికి పెట్టగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో బుధవారం ఉరేసుకున్నాడు.

ఉస్మానియా ఆస్పత్రిలో విద్యుత్ అంతరాయం

- టార్చ్‌లైట్ల వెలుగులో శస్త్రచికిత్సలు

మంగళ్‌హాట్, జూలై 3(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ నిలిచిపోవడంతో రోగులు, వైద్యులు ఉక్కిరిబిక్కిరయ్యారు. శస్త్రచికిత్సలు చేసే సమయంలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిన వెంటనే ప్రారంభం కావాల్సిన జనరేటర్లు సైతం మొరాయించాయి. సిబ్బంది వెంటనే విద్యుత్ విభాగం నిపుణులను రప్పించి అరగంట తర్వాత సేవలను పునరుద్ధరించారు. దీంతో అప్పటివరకు సెల్‌ఫోన్, టార్చ్‌లైట్ల వెలుతురులోనే శస్త్రచికిత్సలను కొనసాగించినట్లు సమాచారం.

'జికా'...వస్తోంది జాగ్రత్త

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం.. మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులతో ఆందోళన

- సంసిద్ధంగాలేని తెలంగాణ వైద్యశాఖ
- కనీస చర్యలూ తీసుకోని వైనం
- ఇప్పటికే రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల విజృంభణ



హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రం మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. రెండు రోజుల క్రితం పుణెలో ఒక్క రోజే ఆరు జికా వైరస్ వ్యాధి (జడ్‌వీడీ) కేసులు నమోదుకావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం బుధవారం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈమేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) డాక్టర్ అతుల్‌గోయల్ అడ్వైయిజరీ జారీ చేశారు. జికాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా గర్భిణులను స్ర్కీనింగ్ చేయాలని కేంద్రం కోరింది. జికా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన గర్భిణుల్లో పిండం ఎదుగుదలను పర్యవేక్షించాలని సూచించింది. ప్రతి ఆస్పత్రిలో కచ్చితంగా ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని, ఆ అధికారి జికా వైరస్ వ్యాప్తికి కారణమయ్యే దోమల పెరుగుదల నివారణకు చర్యలు చేపట్టాలని కోరింది. జికా కేసులు నమోదైతే వెంటనే నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీవీబీడీసీ)కు రిపోర్టు చేయాలని, అనుమానిత నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపాలని సూచించింది. అలాగే ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని వైరస్ పరిశోధనా కేంద్రాలకు కూడా శాంపిళ్లను పంపాలని ఆదేశించింది.

అప్రమత్తంగాలేని రాష్ట్ర వైద్యశాఖ..

మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి మహమ్మారులు వచ్చినప్పుడు వాటిని నియంత్రించే బాధ్యత క్షేత్రస్థాయిలో ప్రజారోగ్య సంచాలకులకే ఉంటుంది. అయితే మన వద్ద ఇంతవరకు అందుకు సంబంధించిన కార్యాచరణేమీ కానరావడంలేదు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల విజృంభణ మొదలైంది. గత ఐదు నెలల్లో మలేరియా, డెంగ్యూ మరణాలు కూడా సంభవించాయి. పటిష్ఠ పర్యవేక్షణ లేకపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన ఉన్న విభాగాధిపతి లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని వైద్యవర్గాలు చెబుతున్నాయి. అందుకే సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల ద్వారా వ్యాప్తి..

జికా వైరస్ అనేది దోమల ద్వారా సంక్రమించే ఫ్లేవి వైరస్. జికా ప్రధానంగా ఏడెస్ దోమల కాటు ద్వారా వ్యాపిస్తుంది. ఇదే దోమ కుడితే డెంగ్యూ, చికున్‌గున్యా, ఎల్లో ఫీవర్ వైరస్‌లు కూడా సోకుతాయి. జికా సోకితే సాధారణ లక్షణాలే ఉంటాయి. ఇవి 2-7 రోజులపాటు కనిపిస్తాయి. ముఖ్యంగా జ్వరం, దద్దుర్లు, కీళ్ల నొప్పి, కండ్లకలక (ఎరుపు కళ్లు), కండరాలు, తలనొప్పితో పాటు మరికొన్ని తీవ్రమైన సమస్యలు కలుగుతాయి. మైక్రోసెఫాలీ (పుట్టుక లోపం), గులియన్ బారే సిండ్రోమ్ (న్యూరోలాజికల్ డిజార్డర్), మెనింజైటిస్ (మెదడు, వెన్నెముక లైనింగ్ వాపు)లాంటి వాటికి కారణమౌతుంది.

నివారణ ఎలాగంటే..

దోమల వృద్ధిని నివారించడానికి ఇళ్లు, బహిరంగ ప్రదేశాల చుట్టూ నిలిచిన నీటిని తొలగించాలి. జికా కూడా లైంగికంగా సంక్రమించే అవకాశం ఉన్నందున సురక్షితమైన విధానాలను పాటించాలి. జికాకు నిర్దిష్ట చికిత్స లేదు, కానీ లక్షణాల ఆధారంగా చికిత్సను అందిస్తారు. జికా లక్షణాలు కనిపిస్తే వెంటనే సరైన రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని డాక్టర్‌ను సంప్రదించాలి.

పిడుగుపాటు కాదు..అంతర్గత లోపమే

- 'భద్రాద్రి పవర్ ప్లాంట్' ప్రమాదంపై తేల్చిన జెన్‌కో..

హైదరాబాద్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రమాదానికి అంతర్గత లోపాలే కారణమని తేలింది. పిడుగుపాటు వల్ల ప్రమాదం జరగలేదని జెన్‌కో స్పష్టం చేసింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఒక్కోటి 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు (1080 మెగావాట్లు) ఉండగా.. అందులో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్-1లోని జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ గత శనివారం అగ్నిప్రమాదం జరిగి కాలిపోయింది. దీనికి పిడుగుపాటే కారణమని తొలుత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ జెన్‌కో అధికారులతో విచారణ జరిపించారు. పిడుగు పడిన సమయంలోనే యాదృచ్ఛికంగా జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో, దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని తేల్చారు. దీనిపై ప్రభుత్వానికి జెన్‌కో తాజాగా నివేదిక సమర్పించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఓ వ్యవస్థ దెబ్బతిని.. ఆయిల్ లీకేజీ జరిగి పూర్తిగా దగ్ధమైందని అందులో అధికారులు వివరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 30 కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీ లించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత రానుందని ప్రభుత్వానికి జెన్‌కో నివేదించింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలకు నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు.

కుటుంబాన్ని మింగేసిన మద్యం రాకాసి

- మద్యానికి బానిసైన భర్త వేధింపులు తాళలేక..
- ముగ్గురు కుమార్తెలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ తల్లీ, ఓ కూతురు మృతి



అనిత (ఫైల్)



రమ్య (ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 3: ఐదుగురు ఆడపిల్లల తండ్రి బాధ్యతలు మరచి మద్యానికి బానిసై వేధింపులకు గురి చేస్తుండడంతో జీవితంపై విరక్తి చెంది అతని భార్యాబిడ్డలు ఆత్మహత్యకు యత్నించారు. భార్య, ఓ కుమార్తె మరణించగా మరో ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమంగా ఉంది. కుమరం భీం జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ఓ కుటుంబాన్ని మద్యం మింగేసింది. గజ్జిగూడకు చెందిన ప్రతాప్‌కు భార్య అనిత(55), ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్ద కూతురికి వివాహమవ్వగా లక్ష్మి(21), రవళి(18), రమ్య(16), ఐశ్వర్య(14) చదువుకుంటున్నారు. మద్యానికి బానిసైన ప్రతాప్ తాగిన మైకంలో గ్రామస్థులతో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తమకున్న వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని అమ్మేశాడు. మిగిలిన కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ అనిత కుటుంబాన్ని పోషించేది. 15 రోజుల క్రితం పొలం వద్ద జరిగిన గొడవలో ప్రతాప్ ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో ప్రతాప్ జైలుకెళ్లాడు. గ్రామ ప్రజల సాయంతో ప్రతాప్‌కు బెయిల్ ఇప్పించిన అనిత భర్తను జైలు నుంచి బయటకు తీసుకొచ్చింది. ప్రతాప్ తీరుమారకపోవడంతో మద్యం మానేయాలంటూ అనిత సోమవారం గొడవపడింది. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రతాప్ భార్య అనితపై దాడి చేసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అనిత.. కుమార్తెలు రమ్య, లక్ష్మి, ఐశ్వర్య, రవళితో కలిసి పొలానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుందామని చెప్పింది. రవళి మినహా తల్లీకూతుళ్లు అందరూ పురుగు మందు తాగేశారు. రవళి కేకలు విని అక్కడికి వచ్చిన చుట్టుపక్కల పొలాల్లోని వారు అనిత, ఆమె కుమార్తెలను ఆస్పత్రికి తరలించారు. అయితే, రెండ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిత, రమ్య బుధవారం మృతి చెందారు. లక్ష్మి, ఐశ్వర్య పరిస్థితి విషమంగా ఉంది. మరోపక్క, ప్రతాప్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



సిద్దిపేట జిల్లా రాయపోల్‌లో గుర్తించిన సిడితల వీరగల్లు

తల నరుక్కొంటే.. శివ సన్నిధికి చేరుకుంటామని..

- చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలంలో శైవుల్లో ఈ విశ్వాసం
- 'సిరితల వీరగల్లు'గా ప్రశస్తి.. సిద్దిపేట జిల్లా రాయల్‌పోల్‌లో విగ్రహం లభ్యం

రాయపోల్, జూలై 3: ప్రాణార్పన చేస్తే దేవుడి సన్నిధికి చేరుకుంటామని నమ్మడం.. ఓ పదునైన ఆయుధంతో తమ తలను తామే నరుక్కోవడమో.. మరొకరితో నరికించుకోవడమో చేయడం గురించి విన్నారా? 6వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు నడిచిన చాళుక్యుల కాలంలో, అప్పట్లోనే రాష్ట్రకూటుల హయాంలో శైవభక్తుల్లో ఈ విశ్వాసం ఉండేదట! బాసింపట్టు వేసుకున్న స్థితిలో తలపైన ఉన్న జుట్టు సాయంతో తాటిచెట్టుకో.. వెదురు చెట్టుకో వేలాడుతున్న వ్యక్తితో ఉన్న ఆ శిల్పాన్ని చూస్తున్నారా? ఆ వ్యక్తి చేతులు ముకుళితమై ఉన్నాయి. తల నుంచి మొండెం వేరయినట్లుగా మధ్యలో గ్యాప్‌ను స్పష్టంగా గమనించొచ్చు! ఈ శిల్పాన్ని 'సిడితల వీరగల్లు' అంటారు. శైవభక్తులు ఆత్మబలిదానాలను ధర్మకార్యంగా భావించేవారు. శివసన్నిధికి చేర్చే తక్షణ మార్గంగా ఆత్మబలిదానాలను ఎంచుకునేవారు. పైగా తల నరుక్కొని మరణిస్తే, తమ ప్రాణాలను తీసుకెళ్లేందుకు దేవాంగనలు వస్తారని విశ్వసించేవారు. ఈ శిల్పంలో.. పైన ఇద్దరు మహిళలుండటాన్ని గమనించవచ్చు! ఫొటోలో కనిపిస్తున్న ఈ 'సిడితల వీరగల్లు' సిద్దిపేట జిల్లా రాయపోల్‌లోని పురాతన గణపతి ఆలయం ప్రాంగణంలోనిది. దీన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ గుర్తించి.. వివరించారు. మహిళా సిడితల వీరగల్లులు జనగామ జిల్లా లింగపల్లిలో లభించాయి. పురుష సిడితల వీరగల్లులు ఇప్పటి దాకా యాదాద్రి జిల్లా చొల్లేరులో, వనపర్తి జిల్లా కేంద్రంలో లభించగా రాయపోల్‌లోనిది మూడోది. ఇక సిడితల వీరగల్లులు కాకుండా కేవలం వీరగల్లులూ ఉంటాయి. తోటి ప్రజలను, పాడిపశువులను కాపాడే క్రమంలో అడవి జంతువులతో పోరాడి చనిపోతే, యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలు కోల్పోతే వారిని వీరగల్లుగా చెక్కి ప్రజలు ఆరాధించేవారు.

పెంటారెడ్డి పదవీకాలం ఆర్నెల్లు పొడిగింపు

నీటిపారుదలశాఖలో ఎత్తిపోతల పథకాల సలహాదారుడు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆర్నెల్ల పాటు పొడిగిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంటారెడ్డి పదవీకాలం పొడిగింపు నిర్ణయం మే 16 నుంచి ఆరునెలల పాటు అమలులో ఉండనుంది.

కూలిన 'నిర్లక్ష్యం'

- ● కుప్పకూలుతున్న మానేరు వంతెన గర్డర్లు
- ● ఈ ఏడాది ఏప్రిల్‌లో మూడు.. తాజాగా ఐదు..
- ● తొమ్మిదేళ్లుగా సాగుతున్న నిర్మాణ పనులు

ముత్తారం, జూలై 3: ఏళ్ల తరబడి సాగుతున్న పనులు.. నాణ్యతా లోపం.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి నిర్మాణ దశలో ఉన్న వంతెన గర్డర్లు కుప్పకూలాయి. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై సుమారు తొమ్మిదేండ్ల క్రితం ఈ వంతెన పనులు మొదలుపెట్టారు. నాటి నుంచి నత్తనడకన సాగుతున్న వంతెన నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందా అని రెండు జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. కాగా మంగళవారం రాత్రి కురిసిన ఈదురుగాలుల వర్షానికి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు పెద్ద శబ్దంతో కిందపడ్డాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పనులు మొదలుకాగా, పనుల్లో అలసత్వం, ఆలస్యం తాజా ఘటనకు కారణంగా కనిపిస్తున్నది. గాలి దుమారమే ఘటనకు కారణమని చెబుతున్నా, వారి నిర్లక్ష్యమే కారణం స్థానిక ప్రజానీకం మండిపడుతున్నది.

● మూడు నెలలైనా కాకముందే..

ఓడెడు వంతెనలోని 10-11 పిల్లర్ల మధ్యలో ఉన్న మూడు గర్డర్లు ఈదురుగాలులకు ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి ఇదే విధంగా నేలమట్టం అయ్యాయి. రెండేళ్లుగా వాగు ఉప్పొంగి ప్రవహించడంతో, గర్డర్లకు సపోర్టుగా పెట్టిన చెక్కలు దెబ్బతిన్నాయి. ఈ కారణంగానే గర్డర్లు నేలకూలాయి. ఈ సంఘటన జరిగి మూడు నెలలైనా గడవకముందే మంగళవారం రాత్రి 17-18 నంబర్ పిల్లర్లపై గర్డర్లు నేలకూలాయి. ఏప్రిల్‌లోనే అధికారులు అప్రమత్తమై ఉంటే తాజా ఘటన జరిగి ఉండేది కాదని ప్రజలు మండిపడుతున్నారు. కూలిన సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.



మంగళవారం రాత్రి కూలిన గడ్డర్లు



గతంలో కూలిన గర్డర్లను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు(ఫైల్)

● గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం

రెండు జిల్లాల మధ్య దూరాన్ని తగ్గించేందుకు 2016లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.49కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించింది. గత ప్రభుత్వంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఈటల రాజేందర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుంచి కూడా ఈ వంతెన పనుల్లో ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. వానాకాలంలో తరచూ వరదలు రావడం.. సామగ్రి దెబ్బతినడం ప్రధాన సమస్యగా మారింది. దీంతో పాటు కాంట్రాక్టర్ పనులు నిలిపివేయడంతో జాప్యం నెలకొంది. మధ్యలో మరో రూ.11కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పనులు ఆలస్యమవడం, అధికారుల పర్యవేక్షణ లోపించడంతో వంతెన దెబ్బతిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి వంతెనను త్వరగా పూర్తిచేయాలని తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. పనులు మళ్లీ వేగంగా మొదలవుతాయని ఆశించిన స్థానిక ప్రజలకు మరోసారి నిరాశే ఎదురైంది. ఇటీవల వంతెనను సందర్శించిన అధికారులు పనుల్లో నాణ్యతా లోపం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. కాగా, కొత్తగా బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు వేయాలని, అదేవిధంగా పనులు మధ్యలో నిలిపేసిన గత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధ్యమానేరు వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో రెండు జిల్లాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వానాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. మట్టి రోడ్డు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు.

మృత్యువుతో పోరాడుతున్న మహిళ

- ఒంటరిగా మిగిలిన మూడేళ్ల కుమారుడు
- వైద్యం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

గంగాధర, జూలై3: అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృత్యువుతో పోరాడుతోంది. గంగాధర మండల కేంద్రానికి చెందిన విశ్వనాథం శ్రీనివాస్ కుమార్తె హారిణి(26) నెల రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లగా వివిధ పరీక్షలు నిర్వహించి మెదడు వాపునకు కారణమయ్యే తీవ్రమైన ఎన్‌సెఫలైటిస్ వ్యాధిగా వైద్యులు నిర్ధారించారు. ఇరవై రోజులుగా హారిణి పరిస్థితి రోజురోజుకూ దిగజారి ప్రాణా పాయ స్థితికి చేరింది. ఆపరేషన్ చేస్తే కానీ మెరుగుపడదని తక్షణం రూ.30లక్షలు సమ కూర్చుకోవాలని వైద్యులు సూచించారు. ఇప్పటికే అప్పులు చేసి 20 లక్షల పైచిలుకు ఖర్చు చేసి వైద్యం చేయించామని తండ్రి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో మృత్యువుతో పోరాడుతున్న హారిణిని కాపాడాలని తండ్రి శ్రీనివాస్ వేడుకుంటున్నాడు. ప్రభుత్వం స్పందించి మెరుగైన వైద్యం అందించాలని కోరుతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న తన తల్లి విషయం తెలియని మూడేళ్ల కుమారుడు ఒంటరిగా మిగిలాడు.

ఒకరి రిమాండ్

ముస్తాబాద్, జూలై 3 : మండలంలోని గూడూరు గ్రామంలో మైనర్‌ను కిడ్నాప్ చేసిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై శేఖర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు గ్రామానికి చెందిన బత్తిని ప్రశాంత్ మైనర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి కిడ్నాప్ చేశాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం కిడ్నాప్ చేసిన ప్రశాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

షార్జాలో కొత్తపేటవాసి ఆత్మహత్య



శేఖర్ (ఫైల్)

రాయికల్, జూలై3: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన తునికి శేఖర్(27) షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. శేఖర్ నెల రోజుల క్రితం బల్దియా కంపెనీలో పనినిమిత్తం వెళ్లాడు. జూన్ 22న శేఖర్ అక్కడే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం గ్రామస్థులకు సమాచారం అందింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

కారు ఢీకొని విద్యుత్ స్తంభాలు ధ్వంసం

మల్యాల, జూలై 3: కొండగట్టు కొండపైన గల బొజ్జపోతన ఆలయం వద్ద ఓ కారు ఢీకొట్టిన సంఘటనలో మూడు విద్యుత్ స్తంభాలు ధ్వంసం అయ్యాయి. ముగ్గురు వ్యక్తులు గత సోమవారం తెల్లవారు జామున టీజీ22జీ4149కారులో వస్తూ నిర్లక్ష్యంగా వాహనం నడుపడంతో రహదారి పక్కన గల స్తంభాలు విరిగిపోయాయని ట్రాన్స్‌కో రామన్నపేట సెక్షన్ ఏఈఈ శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు

బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం, జూలై 3: బాలకార్మికుడిని పనిలో పెట్టుకున్న రాజస్థాన్ హోటల్ యజమానిపై ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లో ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అశోక్‌నగర్ ప్రాంతంలో దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా రాజస్థాన్ జై రామ్ దేవ్ బాబా హోటల్లో 14 సంవత్సరాలలోపు బాలుడు పనిచేస్తుండగా రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ముందు హాజరు పరిచారు. అధికారుల ఆదేశాల మేరకు బాలుడిని షెల్టర్ హోమ్‌లో ఆశ్రయం కల్పించారు. అనంతరం మూడో టౌన్‌లో హోటల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆపరేషన్ ముస్కాన్ -10 టీం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చక్రధర్‌రెడ్డి, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, ఆపరేషన్ ముస్కాన్ ఇంచార్జి ఎస్ఐ అన్వర్, టీం సభ్యులు సాగర్, కవిత పాల్గొన్నారు.

ఖనిలో చోరీ

కోల్‌సిటీ, జూలై 3: గోదావరిఖని జీఎం కాలనీలో ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగలు తులం బంగారం, 70తులాల వెండి ఎత్తుకెళ్లినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. జీఎం కాలనీలో నివాసముండే ఎడ్ల పద్మ అనే గృహిణి పది రోజుల క్రితం ఊరికి వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి ఇంట్లో బీరులో ఉన్న తులం బంగారం, 70తులాల వెండిని దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కరీంనగర్ జైలు నుంచి ఆరుగురు ఖైదీల విడుదల

కరీంనగర్ క్రైం, జూలై 2: వివిధ కేసుల్లో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆరుగురు ఖైదీలు బుధవారం విడుదల అయ్యారు. శిక్ష సమయంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి రాష్ట్ర వ్యాప్తంగా 213 మంది ఖైదీలను విడుదల చేసింది. కరీంనగర్ జిల్లా నుంచి ఏడుగురు ఖైదీల విడుదలకు ప్రతిపాదనలు వెళ్లగా ఆరుగురు ఖైదీలు విడుదలయ్యారు. హత్య కేసుల్లో జీవితఖైదు శిక్ష పడిన ఆరుగురు ఖైదీలను మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి హైదరాబాద్ చర్లపల్లి జైలుకు తరలించారు. వీరందరికీ అక్కడ కౌన్సెలింగ్ నిర్వహించిన జైలు ఉన్నతాధికారులు, వారికి ఉపాధి చూపించి విడుదల చేశారు. ఇందులో ముగ్గురికి కరీంనగర్ జైలు పెట్రోల్ బంక్‌లో ఉపాధి కల్పించారు. కరీంనగర్ జిల్లా జైలు నుంచి 2010 నుంచి ఖైదీలుగా ఉంటున్న ఒకే కుటుంబానికి చెందిన మెచ్చే మధు, ముచ్చె ఆశయ్య, ముచ్చె గంగయ్యలతో పాటు ఎస్‌కే ముస్తాక్, సయ్యద్ జుబేర్, పవార్ రాజులు విడుదలయ్యారు. వీరు ఆరుగురు జైలు నుంచి విడుదల అయిన తరువాత శాంతియుతంగా, సత్ప్రవర్తనతో ఉంటానని 50 వేల రూపాయల స్వంత పూచీ కత్తు బాండ్‌పై విడుదల అయ్యారు. గతంలో వీరికి విధించిన శిక్షాకాలం పూర్తి అయ్యేవరకు వారి గ్రామం పరిధిలోని పోలీసు ఠాణాలో ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. ఏదైనా నేరాలలో పాల్గొంటే రద్దు చేసిన శిక్షను మళ్లీ యదావిధిగా విధిస్తారు.

అట్రాసిటీ కేసుల్లో పరిహారం సకాలంలో అందించాలి

● ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి ● జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్



మాట్లాడుతున్న జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

జగిత్యాల, జూలై 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారం బాధితులకు సకాలంలో అందించాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ పారదర్శకంగా ప్రజలకు సేవ చేయాలని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాలకు వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, ఇతర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను, విద్య, వైద్యం, రుణాలు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు అందిస్తున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల వారీగా అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, పంచాయతీ రాజ్, పరిశ్రమలు, ఎస్సీ సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ, ఎస్సీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వివరాల ప్రగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క అధికారి క్రమ శిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అర్హులను మాత్రమే ఎంపిక చేసి లబ్ధి చేకూరేలా చూడాలని, ప్రభుత్వ నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను కట్టుదిట్టంగా పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమా ర్ బాబు, రిసర్చ్ అధికారి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రావాల్సిన హక్కులను అందించాలి

రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఎస్సీలకు రావాల్సిన హక్కులు వారికి అందుతున్నాయా లేదా పరిశీలించి సకాలంలో అందించాలని అధికారులను ఆదేశించామని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ పట్టాలు అందించే అవకాశంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించి తగిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. విదేశీ విద్యా పథకం, గురుకుల పాఠశాలలో ఎస్సీ విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్‌పై రివ్యూ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు సకాలంలో పరిష్కరించాలని, వీటిపై పార్లమెంట్ 2018లో 18 ఏ సెక్షన్ కింద ఎస్సీలు అందించిన ఫిర్యాదులకు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత నేరస్థులను అరెస్టు చేయాల్సి ఉంటుందన్నారు. అన్యాయం జరిగిన నిమ్న వర్గాల ప్రజలకు అండగా ఎస్సీ కమిషన్ ఉంటుందన్నారు. సమావేశంలో జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకులు సునీల్ కుమార్‌బాబు, రీసర్చ్ అధికారి వరప్రసాద్‌లు పాల్గొన్నారు. జగిత్యాలకు వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌ను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రాంచందర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

మూతపడ్డ చేనేత సంఘాన్ని తెరిపించాలి

సుల్తానాబాద్, జూలై 3: పదేళ్ల క్రితం మూతపడిన చేనేత సంఘాన్ని తెరిపించి ఈప్రాంత చేనేత కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జిల్లా పద్మశాలి సంఘం అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు వల్స నీలయ్య తదితరులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కమీషనర్ శైలజాఅయ్యర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. పద్మశాలి సంఘ నాయకులు వల్స నీలయ్య, లక్ష్మీనారాయణ, పెగడ చందు, గాదాసు రవీందర్, చేనేత సంఘం మాజీ అధ్యక్షులు గోలి శ్రీనివాస్ తదితరులు బుధవారం సుల్తానాబాద్‌లో మాట్లాడుతూ సుల్తానాబాద్‌లో పదేళ్ల నుంచి చేనేత సంఘం మూతపడిందని, దాంతో చేనేత కార్మికుల కుటుంబాలు రోడ్డును పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రి తుమ్మలను కలసి సంఘాన్ని తెరిపించాలని కోరగా, సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే సంబంధిత శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా అయ్యర్‌ను కలిశామన్నారు. అనంతరం మంత్రిని సన్మానించినట్లు వారు తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యులకు సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 3 : ప్రపంచ వైద్యుల దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం మండలంలోని బొంపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీ వైద్యులను మాజీ సర్పంచ్ అరికిల్ల లక్ష్మయ్య సత్కరించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మండల ఆర్‌ఎంపీ అసోసియేషన్ మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ్, నరేష్, నరేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయండి

కోల్‌సిటీటౌన్, జూలై 3: నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై గురువారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌లో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పాల్గొనాలని విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపూరి సూర్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాగర్ మాట్లాడారు. సమావేశంలో నాయకులు మొలుగూరి సోను, సునీల్, సంగే రాహుల్, గడ్డం భరత్, శ్రావణ్, చంద్రగిరి కృష్ణకుమార్, మొగిలిచర్ల సురేష్, అట్ల శివకుమార్, సూర్య పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించండి

కోల్‌సిటీ, జూలై 3: హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో గుండెవ్యాధితో బాధపడుతున్న గోదావరిఖనికి చెందిన మహ్మద్ బషీర్‌కు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. బుధవారం నిమ్స్ ఆసుపత్రిలో బషీర్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ పరామర్శించారు. వైద్యానికి అయ్యే ఖర్చు భరిస్తానని ఎమ్మెల్యే బషీర్ కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

మంథని, జూలై 3: భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని క్రైస్తవులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం స్థానిక మాత శిశు ఆసుపత్రిలో గర్భిణులకు పండ్లను పంపిణీ చేశారు. క్రైస్తవులు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మంథని నియోజకవర్గ పాస్టర్లు ఎలీషా, డేవిడ్, దైవ కృపాకర్, నవీన్, సామిల్, జకరయ్య అశోక్, జోషిలు పాల్గొన్నారు.

మొక్కలపై విద్యార్థుల నాటిక

కాల్వశ్రీరాంపూర్, జూలై 3: మండల కేంద్రంలోని గుడ్ షెపర్డ్ పాఠశాలలో మొక్కలపై బుధవారం విద్యార్థులతో నాటిక, నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చుట్టూ మొక్కలు నాటారు. అనంతరం మొక్కలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

మంథని, జూలై 3: బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి ఆదేశాల మేరకు హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ, కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను బుధవారం మంథని ప్రధాన చౌరస్తాలో దగ్ధం చేశారు. మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, చిలువేరు సతీష్, రాజేందర్, లక్ష్మణ్, ఎడ్ల సాగర్, విష్ణు, అశోక్, మురళీకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థి

సుల్తానాబాద్, జూలై 3: సుల్తానాబాద్ ప్రభుత్వ హైస్కూల్‌లో పదవ తరగతి చదివి ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్ హారిక అనే విద్యార్థిని బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిందని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రత్నాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, బాసర ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన ఎస్ హారికను బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.



పెద్దపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు



కమాన్‌పూర్‌లో ఎంపీటీసీ సభ్యులకు సన్మానం..

ప్రజా సేవే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

- ముగిసిన మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం.. ఘనంగా సన్మానం

పెద్దపల్లి రూరల్, జూలై 3 : ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు పదవికాలం అయిందని దిగులు చెందకుండా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం కావాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులకు ఆత్మీయ సన్మాన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీపీతో పాటు ఎంపీటీసీలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయ పరిధిలో నూతన నిర్మించిన దుకాణసముదాయాలను ఎమ్మెల్యే ప్రారంభించి, కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఎంపీటీసీలకు, ఉద్యోగులకు, సిబ్బందిని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు సత్కరించి, మెమొంటోలను అందజేశారు. ఎంపీపీ స్రవంతి, వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మంథని, జూలై 3: మంథని ఎంపీపీ కొండ శంకర్‌తో పాటు వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను అధికారులు, ఆత్మీయులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐదు సంవత్సరాల పాటు ప్రజాప్రతినిధులుగా సేవలందించి విజయవంతంగా పదవీ ముగించుకున్న ఎంపీపీ కొండ శంకర్‌తో పాటు వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్, ఎంపీటీసీలను అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూన్ 3: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీతో పాటు ఎంపీటీసీల పదవీకాలం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వారిని సన్మానించారు. అనంతరం మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఎంపీపీ నూనేటి సంపత్‌తోపాటు ఎంపీటీసీలను సన్మానించారు. ఆయా శాఖల అధికారులు కూడా ఎంపీపీని, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, ఎంపీడీవో రామ్మోహనచారి, తహసీల్దార్ జాహిద్‌పాషా పాల్గొన్నారు.

రామగిరి, జూలై 3: మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన చివరి సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఆరెల్లి దేవక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు పలు అంశాలపై ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం ఎంపీపీ మాటాడారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్కతో పాటు ఎంపీటీసీ సభ్యులను సత్కరించారు. జడ్‌పీటీసీ మ్యాదరవేని శారద, సింగిల్‌విండో ఛైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, వైస్‌ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి, ఎంపీడీవో శైలజ శాంతి, ఎంపీవో సమ్మిరెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జూలై 3 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుల పదవి విరమణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ రాచకొండ లక్ష్మీ రవి దంపతులను, వైస్ ఎంపీపీ ఉప్పరి శ్రీనివాస్‌యాదవ్, జూలపల్లి-1 ఎంపీటీసీ శేవ్వా శంకరయ్యలను మండల ప్రత్యేకాధికారి, జిల్లా సంక్షేమ అధికారి రావూఫ్ ఖాన్, ఇంచార్జీ ఎంపీడీవో శేషయ్య సూరిలు సత్కరించారు. సీనియర్ అసిస్టెంట్ వంశీ, ఏపీవో లావణ్య, గ్రామ కార్యదర్శులు, కారొబార్‌లు తదితరులు ఉన్నారు.



కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు



రామగిరిలో..



మంథనిలో..

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి : ఏసీపీ

కోల్‌సిటీటౌన్, జూలై 3: సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటి నియంత్రించవచ్చని సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. బుధవారం గోదావరిఖని కాకతీయ జూనియర్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వెంకటరమణ మాట్లాడారు. సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి, సిబ్బంది కీర్తి వెంకటేష్, కుమార్, శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 3: సుల్తానాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మండలంలోని నారాయణపూర్, దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం మెరుగైన సామాజిక సంబందాలు కలిగి ఉండాలన్న అంశంపై ఎస్‌ఐలు శ్రావణ్‌కుమార్, నరేష్, స్నేహ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో కింద భారీ శిక్షలు పడతాయని, పిలల్లను తల్లిదండ్రులు కాపాడుకోవాలని, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ

ఓదెల, జూలై 3 : మండల కేంద్రంతో పాటు పొత్కపల్లిలో బుధవారం పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులతో ఎస్ఐ అశోక్‌రెడ్డి కమ్యూనిటీ కాంటాక్ట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్, జూలై 3 : మహిళల భద్రత, సైబర్ నేరాలపై బుధవారం పోలీసులు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం షీటీంలు పని చేస్తున్నాయని చెప్పారు. ఆయన వెంట షీటీం స్నేహలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 3: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో బుధవారం బాలికలకు కొత్త చట్టాలపై ఎస్ఐ ఓంకార్ యాదవ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, పోలీస్ సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.

జూలపల్లి, జూలై 3 : మండలంలోని తెలుకుంటలో గల కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం ఎస్ఐ శ్రీధర్ సమాజంలోని విలువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో ఏఎస్ఐ శ్రీనివాస్‌రావు, పీసీ సతీష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



బేస్‌వర్క్‌షాప్ బీఎంఎస్ పిట్ కమిటీ ఎన్నిక

యైటింక్లయిన్‌కాలనీ, జూలై3:బీఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్ పిట్ కమిటీని బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పిట్ సెక్రెటరీగా గట్టు శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రెటరీగా ఎస్ రాజు, జాయింట్ సెక్రెటరీ రాకేష్, ఎలక్ట్రికల్ సెక్షన్ ఇంచార్జిగా ప్రభాకర్, టైర్ సెక్షన్ ఇంచార్జి క్రాంతి, 100టన్నుల సెక్షన్ ఇన్‌చార్జిగా రవీందర్‌తోపాటు రవీందర్, కే రాజయ్య, మొగిలిలను పిట్ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ఏరియా వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి, నాయకులు వేణుగోపాల్‌రావు, సారంగపాణి, మాదాసి రవీందర్ పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 3: సింగరేణి సేవా సమితి ఆర్జీ-2 ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వృత్తివిద్యా కోర్సులకు ఆసక్తి గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని జీఎం సూర్యనారాయణ తెలిపారు. టైలరింగ్, మగ్గంవర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులతోపాటు విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్ జిరాక్స్, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఈనెల 15వ తేదీలోపు పర్సనల్ విభాగంలో అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

రామగిరి, జూలై 3: ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో సింగరేణి కల్పిస్తున్న ఉచిత వృత్తి శిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్న బుధవారం పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు ఈనెల 15న జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో సంప్రదించాలన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, జూలై 3: ఉచిత వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి హేవీ గూడ్స్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి మూడేళ్ల అనుభవం కలిగి ఉన్న పరిసర గ్రామాల నిరుద్యోగ యువకులకు ఉచితంగా వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల10లోపు ఎంవిటీసీ కార్యాలయంలో నేరుగా సంప్రదించాల్సిందిగా తెలిపారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, జూలై3: బొగ్గుబ్లాక్‌ల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 5న కలెక్టర్ ఆఫీస్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఓసీపీ-3 షావల్ సెక్షన్, స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్‌లలో గేట్‌మీటింగ్‌లను నిర్వహించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం

గోదావరిఖని, జూలై 3: బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు రెండు పార్టీలు దొంగలేనని, పెట్టుబడిదారులతో కుమ్మక్కై, బొగ్గుగనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు వేలం నిర్వహిస్తున్నారని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రధాన చౌరస్తాలో టీబీజీకేఎస్ కేంద్ర నాయకత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, వడ్డేపల్లి శంకర్, పొలాడి శ్రీనివాసరావు, దూట శేషగిరి, మోదుంపల్లి రాజేషం, బొగ్గుల సాయి, కళాధర్‌రెడ్డి, ఉప్పులేటి తిరుపతి, పల్లె సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 3:బొగ్గు బ్లాక్‌ల ప్రైవేటీకరణను నిరసిస్తూ బుధవారం టీబీజీకేఎస్ శ్రేణులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశాయి. యూనియన్ ఆఫీస్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏరియా వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ మాట్లాడారు. బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, అనిల్‌రెడ్డి, సురేందర్, రవితేజ, లింగారెడ్డి, రాజమౌళి, దాసరి శ్రీనివాస్, రమేష్, సమ్మయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో..



యైటింక్లయిన్ కాలనీలో..

రామగిరి, జూలై 3: సింగరేణి బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు.కార్యక్రమంలో పింగిళి సంపత్‌రెడ్డి, కేశవరావు, మల్లేష్, ఉప్పు వెంకటేశ్వర్లు, అల్లం తిరుపతి, నాగెల్లి సాంబయ్య, శివశంకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకులను నామినేషన్ పద్ధతిలో కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని, జూలై 3: తెలంగాణలోని నూతన బొగ్గు బ్లాకులను వేలం వేయకుండా నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొగ్గు బ్లాకులను బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలకు ఇవ్వకుండా వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నదని, తెలంగాణలో ఉన్న నూతన బొగ్గు బ్లాకులను వేలం వేయవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏఐటీయూసీ విన్నవించినా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరి అవలంభిస్తుందని, దీనివల్ల సింగరేణికి మనుగడ ఉందని, తెలంగాణ ప్రజలకు తీవ్రనష్టం వాటిల్లుతుందన్నారు. ఎంఎండీఆర్ చట్టం కింద ఇతర రాష్ట్రాల్లో ఇచ్చిన విధంగా సింగరేణికే నూతన బ్లాకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 5న జరిగే కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని, 17న హైదరాబాద్‌లో బొగ్గు గనులను వేలం వేసే కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టినట్టు తెలిపారు. మాదన మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లయ్య, కవ్వంపల్లి స్వామి, రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలం రద్దు చేయాలి

ఏఐటీయూసీ డిప్యూటీజనరల్ సెక్రెటరీ వైవీ రావు

రామగిరి, జూలై 3: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలంను రద్దుచేయాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కుట్ర పూరిత విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. తెలంగాణలోని సింగరేణి గనులను వేలం వేయకుండా బేషరతుగా సింగరేణికి కేటాయింపు చేపట్టాలని డిమాండ్ చేశారు. వేలం రద్దు కోరుతూ ఈనెల 5న సింగరేణివ్యాప్తంగా ఉన్న కలెక్టర్ల కార్యాలయాలను ముట్టడి చేపడుతామని పేర్కొన్నారు. సింగరేణి ఏరియాలో జీఎం కార్యాలయాల ఎదుట దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వేలంపై వెనక్కి తగ్గని పక్షంలో రాజకీయ పార్టీలతో కలిసి కార్యక్రమాలను రూపొందిస్తామని హెచ్చరించారు.

ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు సంపత్, పోశం, రాజు, సాంబశివరెడ్డి, రాజయ్య, నరేష్, లక్ష్మయ్య, శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి



ప్లాంటేషన్ గుంతలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి రూరల్, జూలై 3: అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా కొంత స్థలం విడిచిపెట్టి మొక్కలు నాటాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దబొంకూర్‌లో వన మహోత్సవం కార్యక్రమంలో అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటేందుకు తవ్విన గుంతలను పరిశీలించారు. విద్యుత్ స్థంభాల వద్ద, వైర్ల కింద మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వొద్దని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్, పెద్దపల్లి ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సుదర్శన్, ఈజీఎస్ జేఈ రాజయ్య, పంచాయితి కార్యదర్శి స్వప్న, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ దివ్య, సురేష్ పాల్గొన్నారు.

'రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలిరావాలి'

ఓదెల, జూలై 3: ఆసరా పెన్షన్ పెంపుదల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు తరలి రావాలని వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఐరెడ్డి నారాయణరెడ్డి కోరారు. వికలాంగులకు ఉచిత బస్ పాసు, రూ.4000 పెన్షన్ పెంపుదల కోసం ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధం కావాలని నారాయణరెడ్డి కోరారు.

అల్ఫోర్స్ పాఠశాలలో మాక్ పోలింగ్

సుల్తానాబాద్, జూలై 3: పట్టణంలోని అల్ఫోర్స్ స్కూల్‌లో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. అల్ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు విభాగాలుగా విద్యార్థులను విభజించి వారికి ఎన్నికలను నిర్వహించారు. పలు గుర్తులతో కూడిన బ్యాలెట్ పేపర్లు ఇచ్చారు. 892 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుసుకుంటారన్నారు.

'పకడ్బందీగా రైతు భరోసా అమలు'



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనాథ్

సుల్తానాబాద్, జూలై 3: రైతులు అందించే సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతు భరోసా పథకాన్ని పకడ్బందీగా ప్రభుత్వం అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ పెద్దపల్లి డివిజన్ ఏడీఏ శ్రీనాథ్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల, కనుకుల సహకార సంఘాల పరిధిలోని రైతలతో బుధవారం ఆయా గ్రామాల్లోని రైతు వేదికలలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సుద్దాల, కనుకుల సింగిల్‌విండో ఛైర్మన్‌లు గడ్డం మహిపాల్ రెడ్డి, కోట వీణ, సీఈవోలు పెర్క సతీష్, బొంగోని శంకరయ్య, సహకార శాఖ అధికారి సురేందర్‌రెడ్డి, స్రవంతి, వైస్ ఛైర్మన్ డిల్లేశ్వర్‌రావు, ఏఈవో కడారి ప్రశాంత్, వినీత్‌తో పాటు డైరెక్టర్లు మైలారం నారాయణ, మాచర్ల అశోక్, గాండ్ల శంకర్, శ్రీనివాస్, లలిత పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలి

పెద్దపల్లి రూరల్, జూలై 3: గ్రామీణ అభివృద్ధి శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు త్వరితగతిన పేస్కేల్ అమలు చేయాలని బుధవారం పెద్దపల్లిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈజీఎస్ ఉద్యోగులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ బొంగోని వెంకటేష్ గౌడ్, కో కన్వీనర్ మహంకాళి రాజయ్య, ప్లాంటేషన్ మేనేజర్ మధుకర్, సురేష్ ఉన్నారు.

'విద్యతోనే అభివృద్ధి సాధ్యం'

సుల్తానాబాద్, జూలై 3: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని సెయింట్ మెరీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఫాదర్ శౌరిరెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శౌరిరెడ్డి, వినయ్, ప్రవీణ్, రజిత, జావేరియా, వసంత, బాల, రాకేష్, సంతోష్, సంపత్, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు

ఓదెల, జూలై 3: రాష్ట్రంలో కాంగ్రెస్‌లో పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు విడతల వారీగా సంక్షేమ ఫలాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కొమిరలో బుధవారం పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలకు ఎమ్మెల్యే హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఇక్కడ ఎస్సీ కమిటీ భవనం నిర్మాణం, అలాగే శానగొండ చెరువు మత్తడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గుంపులలో వైకుంఠధామం, అంతర్గత సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, ఆళ్ల సుమన్ రెడ్డి, అంబాల కొమురయ్య, అంకం రమేష్, ఆకుల మహేందర్, జక్కుల వెంకటస్వామి, నీర్ల శ్రీనివాస్, బొంగోని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న కందుల సంధ్యారాణి

కోల్‌సిటీటౌన్, జూలై 3: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పిలుపునిచ్చారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గోదావరిఖని విఠల్‌నగర్‌లో తిలక్‌నగర్ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ సహకారంతో బూత్ అధ్యక్షుడు పల్లపు సంపూర్ణ ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కందుల సంధ్యారాణి మొక్కలు నాటారు. కార్యక్రమంలో గుండబోయిన భూమయ్య, కొమ్ము గట్టయ్య, ముకిరి రాజు, పవన్, ప్రవీణ్, కండె సాగర్, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ మెంబర్‌కు ఘనంగా సన్మానం

పెద్దపల్లిటౌన్, జూలై 3: తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ, టీఎన్జీవో, టీజీఓ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయ్ జేఏసీఛైర్మన్ బొంకూరి శంకర్ కో ఛైర్మన్ తూము రవీందర్ ఉపాధ్యక్షులు ఎడ్ల కొమురయ్య ఆర్గనైజింగ్ సెక్రెటరీ మహేందర్ రెడ్డి రాజేష్ ప్రవీణ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అనగాష్టమి వ్రత వేడుకలు

సుల్తానాబాద్, జూలై 3: స్థానిక వైశ్యా భవన్ లో బుధవారం అనగాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్రతాలలో దంపతుల యుక్తంగా పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.